# త్వమేవ శరణం మమ

అసలు రాంబాబు వుంటున్న ఇంటాయన శివశంకరంగారు బాగా ఆస్తిపరుడే. ఈ మూడంతస్తుల మేడ కాక, వాళ్ళకి బాపట్ల దగ్గరో ఎక్కడో ఏడు చింతలపాలెం గావును, అక్కడ పొలాలు కూడా వున్నాయట. అయితేనేం ఆయన పట్నంలోనే స్థిరపడి తెలుగు టీచరుగా రిటైరయి మేడ కట్టించాడు.

పెళ్ళికావలసినపిల్ల ఆయనకి పాపం ఒక్కగానొక్కతే. పేరు రాణి. గారాబుకూచి. ఈ పిడగాక యింకా ఆడా మగా అన్ని సైజుల్లోనూ సుమారు అరడజను మంది. చిట్టచివరకి ఒక ఏడు పొడి. వాడి స్థానం ఎప్పుడు పంతులుగారి భుజంమీదే. ఇహపోతే గృహలక్ష్మి రుక్మిణమ్మగారు ఆయనకంటే మహావుంటే యింకో జానెడు పొడుగుంటుందేమో. ఆయన మాతృదేవత యింకా అవతారం చాలించకపోవటంచేత "ఎటొచ్చీ యింకా నలభైఎనిమిదేళ్ళేకదండీ నాకు..." అనుకుంటాడు పంతులుగారు.

ధర్మం యమగా అమలు జరిపించే యమధర్మపీఠం నుంచి వారం వారం వారంటు మీద వారంటు జారీ అవుతున్నా ముసలావిడ ససేమిరా అని ప్రయాణం కావటంలేదు— ఇదీ ఆ సంసారపు సంక్షిప్తసమాచారం—

'పిల్లకి యింకా యిరవై దాటలేదుగా' అని ఆయనకింకా కొంత స్థైర్యం. "పిల్లకి యీ యేడాది పెళ్ళిచేయాలంటే కనీసం నాలుగు వేలయినా కావాలా! యీ నాలుగు వేలూ పెట్టితే ఇంటిపైన యింకో రెండు గదులు వేసుకోవచ్చు కదా!" అని ఆయన యిప్పటికి ఆరేళ్ళనుంచి అనుకుంటూ, ఆరు రెళ్ళు పన్నెండు గదులు కట్టించేశాడు మేడమీద.

ఈ ఏడాదికి కూడా అట్లాగే వాయిదా వెయ్యటంతో మూడో అంతస్తులో ఒక గదీ, ఆ గదిలో రాంబాబు వెలిశారు.

* * *

కానీ ఖర్చులేకుండా ఏ గండభేరుండమైనా వచ్చి పిల్లను ఎత్తుకుపోతుందేమో ఒక్కోగ్రహం వదిలిపోతుందని ఆ శుభముహూర్తంకోసం ఎదురుచూస్తున్నాడు శంకరంగారు. ఇప్పటికి చాలామంది జ్యోతిష్కులను పిలిపించాడు. కాని ముహూర్తం మాత్రం తేలటంలేదు. మొన్నీమధ్యనే ఒక జ్యోతిష్కుడు వచ్చాడు.

"మిమ్మల్ని ఒక గ్రహం పీడిస్తోందండీ" అని చెప్పాడు.

"ఏడిసినట్టే వుంది. ఆ సంగతి మీరే చెప్పాలా! నాకు తెలీదూ! అసలది ఎప్పుడు విరగడవుతుందో సెలవియ్యండి" అన్నారు పంతులుగారు విసుక్కుంటూ.

ఆయన యింకా కొంత తీవ్రంగా ఆలోచించి ఆ గ్రహం మిమ్మల్ని వదిలే సూచనలు లేవండీ. అదీకాక యీ సంవత్సరం మీకు మరో కొత్త గ్రహంకూడా పట్టవచ్చు" అని శుభవార్త చెవినివేసి జారుకున్నాడు జ్యోతిష్కుడు.

దీనికి తోడు ఆయనకొరాత్రి బ్రహ్మాండమైన కలకూడా వచ్చింది. ఓ పేద్ద డేగ కోడిపిల్లను ఎగరేసుకుపోయింది. ఇన్నాళ్ళనుంచీ యింట్లో నానా చాటూచేస్తున్న

## నండూరి పార్థసారథి

కోడిపిల్ల విరగడయినందుకు పంతులుగారు బ్రహ్మానందబాష్పాలు కార్చబోతూండగా ఆకాశంమీంచి ఆకోడి వూడిపడింది. శంకరంగారు విచారంతో కుప్పకూలిపోయారు మంచంమీద నుంచి.

"ఛీ! పీడ కల" అనుకున్నాడు కళ్ళు నలుపుకుంటూ.

* * *

శంకరంగారు, ఒకచేత్తో ఊరకుక్క మెడకట్టిన గొలుసూ, రెండో చేత్తో ఒక పాత గొడుగు కర్రా పుచ్చుకుని ప్రతిరోజూ సాయంకాలంషికారుకి వెళ్తాడు, దారిప్రక్కన ఎక్కడైనా ఉచితంగా వరులు దొరుకుతారేమోనని. పొట్టిగా స్థూలంగావుండే ఆయన కాయాన్ని ఆ వూరకుక్క లాక్కెళ్ళుతూ వుంటుంది ముందు. బట్టతలమీద హాటూ, పాంటులో షర్టు టక్ చేసి ఒక కోటూ వేసుకుని రాచరీవి వుట్టిపడేలా నడిచేవాడు. ఆయన యింటిపేరు "యమ్". అసలు ఇంటిపేరు ఎవరికీ తెలీదు కాని "మీసాల" అనిమాత్రం ఆ వీధిలో చాలామంది కుర్రాళ్ల నమ్మకం. ఆయన నెరసిన గుబురు మీసాల ప్రత్యేకత ఏమిటంటే, అవి అవసరానుకూలంగా పైకీ కిందికీ పోతూవుంటాయి. పైగా ఆయన నవ్వుతున్నపుడు ఆయన కొత్తగా యీమధ్యనే కట్టించుకున్న బంగారపు పళ్ళు రెండిటికీ పబ్లిసిటీ ఇచ్చే పద్ధతిలో కత్తిరింపబడి వుంటాయి అవి. అలా తిరిగి తిరిగి చీకటిపడేవేళకు కొంపకు చేరుకునేవాడు. దురదృష్టదేవత ఆయన మొహాన బోర్డు కట్టి కూర్చుంటే ఎలా దొరుకుతారు వరులు వుచితంగా?

ఇంటికి రాగానే ముసలావిడ ఎదురుగ్గా వచ్చి శాపనార్థాలతో దిష్టితీసేది. "నేను బతికివుండగా నువు దానికి పెళ్లి చెయ్యవురా! నువ్వెందుకు చేస్తావ్! నువు నా చావుకోసం ఎదురుచూస్తున్నావాయెను. నువు బాగుపడవులే, నాకు తెలుసుగా! దాని ఉసురు కట్టుకుపోతావ్! గదిమీద గది ఏడు అంతస్తులు కట్టిస్తే పోయేటప్పుడేం కట్టుకుపోవు. నిక్షేపంగా పెళ్లికావాల్సిన పిల్ల, అందులోనూ పెద్దపిల్ల బంగారపుబొమ్మను పెట్టుకుని, దాని పెళ్ళి చెయ్యటానికి నాలుగువేలు ఖర్చు పెట్టితే యింతలోనే బికారివాడివయిపోతావా? నీకిదేం మాయరోగంరా... నా కడుపున చెడపుట్టావురా. ఇంతకీ దాని ఖర్మ. దాని మొహాన అలా రాసిపెట్టాడు మాయదారి దేవుడు..." ఇహ దానికి అంతు వుండదు.

"అబ్బబ్బ. ఛస్తున్నా ప్రతిరోజూ ముందు నీ పోరు పడలేక. ఇహ రోజూ యిలాగే సణుగుడు ప్రారంభిస్తే నీకంటే ముందు నేనే ఛస్తాను. ఏం! ఇంతలావు మేడ కట్టించానంటే నేను కట్టుకుపోదామనా! ప్రతివాళ్ళూ యిల్లు యిల్లు అని యింటిమీదపడి ఏడుస్తున్నారు. ఏమిటో వాళ్ల తాతలముల్లెలు పెట్టి కట్టిస్తున్నట్టు. నా యిష్టం. ఇంకా ఏడు అంతస్తులు కట్టిస్తా. మీరెవరు మధ్య అడగటానికి. అయినా ఎంత కూడబెట్టినా వాళ్ళకోసమేగా. వేలకువేలు పోసి ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేస్తే యిహ మగపిల్లలకు నోట్లో మట్టే... అయినా దానికేం వూరికే చెప్పించటం లేదు చదువు". యీ చివరి ముక్క కొంత నెమ్మదిగా గొణుక్కుంటూ అన్నాడు.

అసలు పిల్లను ఆయన యింతవరకూ చదివిస్తూనే వుండటానికీ, ఆమె ఎప్పుడూ ఐదో ఫారంలోనే వుండటానికీ వెనక ఒక బ్రహ్మాండమైన చిదంబర రహస్యం వుంది. అది ఆరేళ్ల క్రితమే, ముసలావిడకి తెలీకుండా దంపతులిద్దరూ రహస్యంగా వేసిన పథకం.

## రోజంతా శుభ్రముగా నుండుటకు

ఆకర్షణీయమైన సువాసన, బహు మెత్తని పొడి-మరే టాయిలెట్ పౌడరులోనూ లేనట్టి-చమట దుర్గంధమును, చర్మవ్యాధులను గలిగించు క్రిములను నిర్మూలించే లోకప్రసిద్ధ యిన జి-11* వీటిని గలిగియున్నప్పటికి గోద్రెజ్ టాయిలెట్ పౌడరు ఎక్కువ ఖరీదేమీ లేదు.

ఉక్కపోతనుండి నిలకడైన శ్రమ విముక్తి గలిగించి చమటవల్ల చర్మము రేగుటను పోగొట్టును. ఇది పసిబిడ్డలకు వరప్రసాదము!

గోద్రెజ్

### టాయిలెట్ పౌడరు

దుర్గంధమును పోగొట్టును
సురక్షకమైనది • సువాసనగలది • శమనకరమైనది

సంపూర్ణ రక్షణకు సింథాల్ తో స్నానముచేసిన పిదప వాడండి.

(* పేటెంట్ హెగ్జాక్లోరోఫిన్ యు. ఎస్ ఎ)




గోద్రెజ్ శ్రేష్ఠమైన సబ్బులను ఇతర టాయిలెట్రీలను తయారుచేయును.

# ప్రేమ శరణం మమ

హైస్కూల్లో చదివిస్తే ఏ కుఱ్ఱాడో ఆమెని యిట్టే ప్రేమించేసి, రాక్షస వివాహమో, గాంధర్వ వివాహమో చేసుకోవచ్చు. ఈ కలికాలంలో, అందులోనూ యిలాంటి పట్నాల్లో అది అసాధ్యం కాదని ఆయనకు తెలుసు. అందుకే అంత దూరదృష్టితో ముందే జాగ్రత్తపడ్డాడు శంకరంగారు. కలికాలపు పరమ రహస్యాన్ని అంత చక్కగా వుపయోగించుకోగలిగాడాయన.

అయితే ఐదో ఫారందాకా వచ్చినా పిల్ల ఒక్క 'స్టెప్' అయినా ముందుకు వెయ్యకపోవటం చూసేసరికి పంతులుగారు కంగారు పడ్డాడు. అంత బ్రహ్మాండమైన పథకం యిలా నీళ్ళుకారిపోవటం ఆయనకి చాలా నిస్పృహ కలిగించింది. మళ్లీ యింకో పథకం తయారుచేశాడు. అమ్మాయి చక్కనిదే అయినా కొంచెం పిచ్చిది. అమాయకపుది. పైగా పందొమ్మిదేళ్ల పిల్లలా కన్పించదు. కాబట్టి ఫర్వా లేదు. కాని అమ్మాయి యిప్పుడు కొంపతీసి ఐదో ఫారం ప్యాసయిందంటే యస్. యస్. యల్. సి. నాలుగేళ్ళ కంటే ఎక్కువ ఛాన్సు వుండదు. ఆ తర్వాతయినా యింట్లో కూర్చోవాల్సిందే. ఈలోగా ఆలోగా ఎవడయినా గంధర్వుడు యీమె ప్రేమపాశాల్లో చిక్కుకుంటాడో లేదో నమ్మకమేమిటి! ఇంత దూరం ఆలోచించి శంకరంగారు అమ్మాయిని ఐదో ఫారం ప్యాసు కాకుండా చెయ్యాలని నిశ్చయించుకున్నాడు.

మొదటి రెండేళ్ళూ అమ్మాయి నాన్నగారి చేయూత లేకుండానే స్వయంగానే పరీక్ష తప్పగలిగింది. శంకరంగారి హయాంలో తర్వాత రెండేళ్ళుకూడా తన పలుకుబడిని కరగించి ఆ క్లాసు దాటిపోకుండా చూశాడు. ఈ యేడాది ఆయనిహ రిటైరయిపోయాడు. ఈ యేడాదే ఆయనకి కొంత ఆందోళనగా వుంది. ఆ పిల్ల ఐదో ఫారంలో తనసీటు రిజర్వుచేసుకొని స్థిర నివాసం ఏర్పరచుకొంది. కాని ప్రయోజనం మాత్రం పలకడంలా. పైగా అనవసరంగా జీతంకట్టడంకూడా వృథాఅవుతోందే అని పంతులుగారికి బెంగపట్టుకుంది. శనిదేవత ఆమెలో పరకాయప్రవేశం చేస్తే, ఆవిడ మాత్రం ఏం చేస్తుంది పాపం. ఆ శని ఈయేటితో వదిలిపోతుందేమోనని అందరికీ ఆశ.

అసలు నిక్షేపంగా మూడో అంతస్తులో రాంబాబును పెట్టుకుని యింకా వుపేక్షించడం దేనికని మీకు సందేహం రావచ్చు. రాంబాబు గదిలో వెలిసిన మర్నాడే మూడో అంతస్థులోకి, గాలం విసిరిచూశాడు శంకరంగారు. కాని కనీసం నాలుగు వేల కట్నమయినా గాలానికి కట్టకపోతే అంతలావు చేప పడుతుందా వట్టిగా గాలానికి. పాపం ఆయన ఎన్నిసార్లు గాలాన్ని లాగిచూసినా వట్టిదే బయటికొచ్చింది. అందుకని అది తన అంతస్థుకి అతీతమైనదనే నిశ్చయానికి వచ్చేశాడాయన.

* * *

వాగి వాగి నోరువాచి మాతృదేవతగారు, యిహ తను అవతారం చాలించటం అత్యవసరంగా పరిణమించిందని తెలుసుకొని, రాత్రికిరాత్రి, అజ్ఞాతన్యాయస్థానంనుంచి వచ్చిన కడసారివారంటుపుచ్చుకొని, మూటాముల్లె సర్దేసి అర్జెంటుగా వెళ్ళిపోయింది. (లేకపోతే యమధర్మారావుగారే స్వయంగా దున్నపోతువాహనంమీద సపరివారంగావచ్చి ఆవిడని బలాత్కారంగా తోడ్కొని వెళ్ళారో) ఆమె భౌతిక దేహాన్ని శ్మశానం వరకు సాగనంపారు పంతులుగారు. సగం పీడ విరగడయిందనుకొన్నాడు. ఇహ తీరుబడిగా దంపతులిద్దరూ కూర్చుని ఆలోచించుకోవచ్చు.


రాణికి ఇంట్లోవున్నంతసేపూ వీథిపైపు కిటికీలోనే నివాసం. రోజూ ఉదయం, సాయంకాలం ఓ అపరకృష్ణుడు ఆదారివెంటే పోవటం నేర్చుకున్నాడు. పోతూపోతూ గాట్టిగా నాలుగయిదు చూపులతూపులు గురిగా కిటికీలోకి విసిరి మరీ పోయేవాడు. అవి వెళ్ళి సరాసరి ఆ అమ్మాయి హృదయఫలకంపై నాటుకునేవి గాఢంగా. ఇది చూస్తున్న వాళ్ళమ్మ ముసిముసినవ్వులు నవ్వుకునేది తనలో.

"ఆ అబ్బాయి ఎందుకమ్మా రోజూ యిటే వెళ్తాడు?...పైగా నా వంక అదేమిటి అట్లా చూస్తాడు.. అసహ్యంగా" అనేది రాణి. "నా పిచ్చితల్లీ" అని ముసిముసి నవ్వుకుంటూ ప్రేమగా మెటికలు విరుచుకునేది మనస్సులో రుక్మిణమ్మగారు.


"ఎవరే అబ్బాయి?" తల్లి మళ్ళీ అడిగేది. "మా క్లాసబ్బాయే. రోజూ క్లాసులోకూడా అట్లాగే చూస్తాడు నా వంక...అమ్మా... ఆ అబ్బాయి ముక్కు అట్లావుంటుందేమే... ఛీ...బావుండదు" అనేది రాణి.

"ఆ.. నీకు మరీ బడాయే...ఏం. అబ్బాయి ముక్కుకేమే. చక్కగా సంపెంగపువ్వులా వుంటే. కుఱ్ఱాడుమాత్రమేం; కొంత నలుపన్న మాటేగాని" ప్రోత్సహించేది, తల్లి.

రోజూ ఆరాజా, యీ రాణీ నివసించే కిటికీదగ్గర కాసేపు మకాం వేసి, కొంటెచూపుబాణాలు కిటికీలోంచి ప్రసరింపచేసి చక్కాపోయేవాడు. క్రమంగా ఆ అమ్మాయికీ ఆ



1



2



3

# వీరెవరో గుర్తుపట్టగలరా?

ముప్ఫయిఅయిదేళ్ళ క్రితం ఇద్దరు ఆంధ్ర ప్రముఖులు, యాభైఏళ్ళక్రితం ఒక ఆంధ్రప్రముఖుడు ఈవిధంగా ఉండేవారు. వీరెవరో గుర్తుపట్టగలరేమో ప్రయత్నించి చూడండి!

(సమాధానాలు 64 వ పేజీలో)

చూపులభాష పరిచయం అయింది. మెల్లిగా కిటికీలోంచి బయటికీ, బయట్నుంచి కిటికీలోకీ ప్రేమ లేఖలు ప్రవహించటం మొదలెట్టాయి. వారిరువురి హృదయపాత్రికల్లోనూ ప్రేమ పాకం ముదరటం మొదలెట్టింది. "మనిద్దరి హృదయాలకుమధ్య యీ యినుప కడ్డీలు అడ్డమాయెనుగా" అని విలాప గీతాలు పాడుకున్నారు విధాయకంగా. తర్వాత యిహ వాళ్ల విరహాగ్నికి యినుప కడ్డీలు విరిగి కరిగిపోయాయి.

* * *

వ్యవహారం క్రింది అంతస్తులో యింత ఝుంఝూమారుతంగా సాగిపోతుంటే రాంబాబు యింకా మూడో అంతస్తులో 'స్టెప్ నంబర్ వన్' అంటూ కూర్చున్నాడు. రాణీ తమ్ముళ్ళనీ, చెల్లెళ్ళనీ మంచి చేసుకుంటున్నాడు బ్లేడులూ, రబ్బరు ముక్కలూ, తగరాలు యిస్తూ. తనకున్న ఆస్తినీ, కట్నపిశాచిని, సంఘాన్నీ తిట్టుకుంటున్నాడు.

ఈ రాజా రాణీ ప్రణయావ్యవహారం ఆ నోటా ఆనోటా పడి ఆపేట అంతా పాక్కింది. (పాక్కిందివిమిటి? శంకరంగారే పాక్కింపచేశారు ఆట్టే మాట్లాడితే). వీరి ప్రేమాయణమే పురాణం అయింది ఆ చుట్టుపక్కల వాళ్ళకి. కాని పాపం రాంబాబు రేడియోమాత్రం 'రిసీవ్' చేసుకోలేగు యీ పురాణాన్ని. సమయంకోసం నిరీక్షిస్తూ తెర వెనుక పొంచివున్నాడు శంకరం పంతులు గారు.

రాజా, రాణీ, ఆనందపిచికల్లో, ప్రేమ డోలికల్లో వూగుతూ వుండగా ఒకరోజు వుయ్యాలతాడు పుటుక్కున తెగింది రసాభాసగా. ఆ పిల్లకి నెల తప్పిన మర్నాడు శంకరంగారు మూడోకన్ను (జ్ఞాననేత్రం) తెరిచారు. ఆరోజు మసకసందెలో, సందు మలుపులో హీరోని చొక్కా కాలరు పట్టుకుని నిలవేశాడు పంతులుగారు. ఆ తర్వాత, యింటికి లాక్కొచ్చి "మా అమ్మాయిబతుకు నట్టేట్లో కలుపుతావుట్రా వుండాకోర్ రాస్కెల్. పద! మీ తల్లిదండ్రుల దగ్గరకి... యింత మర్యాదస్తులకొంప అనుకున్నావా... మరేమనుకున్నావ. నీ పరువుని హుస్సేన్ సాగర్ లో కలుపుతాను పద 'స్కాండ్రల్' యిపుడు మా అమ్మాయిని నువు పెళ్లి చేసుకోకపోతే దాని బ్రతుకేంకాను..." అని నిలదీసి సంజాయిషీ అడిగాడు. పెళ్ళికొడుకు అమాంతం నిలువునా బోర్లపక్కలుగా పడ్డాడు, సాష్టాంగం ఆయన పాదాలమీద. "త్వమేవ శరణం మమ.. అన్యధా శరణం నాస్తి. పాహి మాం...రక్షమాం..." అని పాదాలు గట్టిగా పట్టుకున్నాడు. హాతోస్మి అని దీవించాడు మామగారు. "ఇంతకంటే నాజన్మకేమికావాలి మామగారూ! నన్ను రక్షించారు. మీమేలు జన్మలో మరచిపోలేను. ఆ వెధవ అనాధశరణాలయం బారినుంచి తప్పించారు నన్ను. ముహూర్తం తీరుబడిగా పెట్టుకోవచ్చును. ముందు ఆ నరకంనుంచి ఆ పెట్టే బేడా అయినా తెచ్చుకుంటాను యివాళే," అని ఆనందబాష్పాలు కార్చాడు అల్లుడుగారు.

"హే భగవాన్! కరుణామయా! యింట్లోవుండే గ్రహాన్ని ఒదిలించుకుందామనుకుంటే యింకో దశమగ్రహాన్ని తగిలించావా పరమాత్మ" అంటూ వాపోయారు శంకరంగారు. అతగాడి ఆనంద బాష్పాలూ, యీయనగారి విషాదబాష్పాలూ, స్టెప్ నెంబర్ టూ గురించిన ఆలోచనలు ఆపుచేసి మూడో అంతస్తులోంచి యిదంతా చూస్తున్న, నిక్రృష్టభగ్నప్రేమికుడి అశ్రువులూ కలిసి కాలవలు కట్టాయి— ★


## అసాధారణ చికిత్స

ఆశలు వదులుకొన్న కుష్ఠ రోగులకు అరు వారాల అసాధారణచికిత్స ఆశలు రేకెత్తించును. మొండి చర్మ వ్యాధులకు కూడా చికిత్స చేయబడును.

వెంటనే సలహా తీసికోండి:

**అశోక్ స్కిన్ క్లినిక్**

1/200, టంకసాల వీధి.

(రాముని గుడిదగ్గర) మద్రాసు-1.

శని ఆదివారాల్లో మాత్రం పనిచేయున